

# తప్పు

సతీష్‌చందర్

**త**ప్పే! అడిగేయడం తప్పే! అడక్కూడనిది అడిగేసింది తప్పే!
అమ్మే కదా అని ఆ ఒక్కటి కూడా అడిగేసింది తప్పే!
తన ప్రియుడు రమ్మన్నచోటుకల్లా తీసుకువెళ్లమని కన్నతల్లిని అడిగేసింది మల్లీశ్వరీ దేవి. తప్పే!

తీగకు పందిరి ఎలాగో... మల్లీశ్వరీదేవికి అమ్మ అలాగ.

మల్లీశ్వరీదేవి అల్లుకుంటుంది. అమ్మ మోస్తుంటుంది.

అడిగిందే తడవుగా అతడి దగ్గరకు ఎత్తుకుపోయింది అమ్మ. ఇది తప్పన్నర!

అందుకే పిలిపించారు ఊళ్లో రాజులు.

మల్లీశ్వరీదేవి క్షత్రియ పుత్రిక.

తప్పు తనకి కానీ అమ్మకు కాదు. తానేం చేసినా ఆమెకు ఒప్పే!

ఆ రాత్రిపూట ఎంతో హుషారుగా కూతుర్ని ముస్తాబు చేస్తోంది. చిరంజీవి సౌభాగ్యవతి మల్లి అనబడే మల్లీశ్వరీదేవి వెళ్తున్నది కులపంచాయితీకా? పెళ్లి చూపులకా?

''ఈ ఊళ్లో ఇద్దరే అందగత్తెలు. నీకు తెలవదేంటే...!?'' అడిగింది అమ్మ- నవ్వే మల్లి కళ్లకు చీకటి కాటుకతో సరిహద్దులు గీస్తూ...

''ఏయ్! నేను కాకుండా ఇంకో అందగత్తా? ఎవ్వతే అదీ...?'' మల్లి ఉడుక్కుంటూ తల్లి రెండు బుగ్గలూ పట్టుకుని సాగదీసింది.

''ఊళ్లోకి ఇవాళే దిగిందిలే...! అదుగో చూడు,'' అని కిటికీలోంచి కనిపిస్తున్న చందమామను చూపించింది అమ్మ.

''ఓహో! అదా! దాన్నయితే ఒప్పుకుంటాన్లే. అదీ, నేనూ ముఖంతోనే బతికేస్తాం. ఎందుకంటే...'' అని మల్లి చెబుతుండగానే ముందస్తుగా నోరు మూసేసింది అమ్మ.

''చందమామకన్నా నువ్వే గొప్ప, తెలుసా!'' అంటూ ముస్తాబయిన తన ఇరవయ్యేళ్ల పసిపాప మల్లిని ఎత్తుకుని చంకన వేసుకుంది.

''అవునే పిచ్చిదానా! నాకూ కాళ్లు లేవు, చందమామకీ కాళ్లు లేవు. నన్ను ఎత్తుకోటానికి అమ్మ వుంది. కానీ దానికి అమ్మ లేదు,'' అని అమ్మ బుగ్గను ముద్దు పెట్టింది మల్లి.

*

యరకరాజు వెంకటపతిరాజు ఇల్లు తోట మధ్యలో వెలిగిపోతోంది. అల్లూరి సీతారామరాజు విగ్రహం, బైర్రాజు ఫౌండేషన్ బోర్డూ క్షత్రియ లోగిళ్లకు స్వాగతం పలుకుతున్నాయి.

మల్లీశ్వరీదేవిని ఎత్తుకుని ఆమె తల్లి వడివడిగా నడుచుకుంటూ ఆ ఇంట్లోకి వెళ్లింది.

విద్యుద్దీపాలను తలదన్నే వెలుతురు వచ్చినట్లనిపించింది.

''వెంక మావయ్యా! మీసాలకు రంగేస్కోపోయావా? ముసిలాడ్లా ఉన్నావ్?'' అని ఎదురొచ్చిన వెంకటపతిరాజును పలకరించింది మల్లి.

వెంకటపతిరాజు మల్లీశ్వరికి మేనమామ వరస.

మల్లి వ్యాఖ్యల్ని పట్టించుకోకుండా, ఆమె తల్లి వైపు చూస్తూ, ''వీరలక్ష్మీ! దీన్ని మోసి మోసి చిక్కిపోయి

నట్టున్నావ్!'' అంటూ చేతులు చాచాడు వెంకటపతి రాజు.

''ఏం చేస్తాది మరి. పేరుకు మేనమామలే కానీ, నన్ను మోసేవోడు ఒక్కడూ లేడు,'' అని మల్లి మరో చురక వేసింది.

''నీ కూతురికి పొగరెక్కువే వీరలక్ష్మీ!'' అంటూ మల్లిని చంటిబిడ్డను ఎత్తుకున్నట్లు ఎత్తుకుని, తీసుకు వెళ్లి సోఫాలో తన పక్కనే కూర్చోబెట్టుకున్నాడు. ఉన్నా, లేనట్లుండే కాళ్లని ఎర్రటిలంగాతో కప్పుకుంది. పచ్చటి ఓణీ, మళ్లీ ఎర్రటి బ్లౌజు. ఆకుల మధ్యన మందారంలా ఉంది మల్లి.

మెల్లిమెల్లిగా కులంలో మగాళ్లంతా చేరారు. మల్లి, ఆమె తల్లి వీరలక్ష్మి- ఇద్దరే ఆడాళ్లు.

''వీరలక్ష్మీ! నువ్వు నా సొంత చెల్లెలితో సమానం. నా దగ్గర దాచకమ్మా! ఎవరతను?'' అని వెంకటపతిరాజు అడగ్గానే వీరలక్ష్మి మౌనంగా తల దించుకుంది.

''వెంక మావయ్యా! అమ్మనెందుకడుగుతావ్! నన్నడుగు నేను చెబుతాను. ఆయన పేరు నక్కా సాల్మన్ రాజుగారు,'' అంది మల్లి, తన పెద్ద పెద్ద కళ్లతో.

''రా...జు...గా...రా...!'' ఉక్రోషంగా, నిస్సహాయంగా ఈసడించాడు వెంకటపతిరాజు తెల్లమీసాలు దువ్వుకుంటూ.

''ఇంకేం ఎంకట్రాజా! ఆడూ రాజే కదా కలిపేసుకుందాం. యీరలచ్చిమే...! నువ్వు కూడా ఏ జాన్‌రాజు గారినో సూస్కో. ఎలాగా మీ ఆయన నిన్నొదిలేసి పోయాడు కదా?'' అని లేచాడు ఓ పక్కగా కూర్చున్న కోడిపందాలరాజు- కోడిపుంజు తన కాలికి కట్టిన కత్తిని ఎదుటి కోడి గుండెల్లో దించినట్టు... వీరలక్ష్మి హృదయంలో కసుక్కున పొడిచాడు.

వీరలక్ష్మి ముఖంలో మాయమయిన నెత్తురు.

మల్లి ఒంటిలో పోటెత్తిన నెత్తురు.

చెంప ఛెళ్లుమంది.

కొట్టిందెవరో కాదు వెంకటపతిరాజే.

'రేయ్ కోడిపందాలోడా! నాలుక చీరేస్తాను. వీరలక్ష్మి నా చెల్లెలు. దానిని ఎవడన్నా ఒక్కమాటన్నాడా? ఇక్కడే పాతేస్తాను. పోరా! బయటకు పో!'' అని వెంకటపతిరాజు చిందులు తొక్కాడు. కోడిపందాలు రాజు ఓడిన పుంజులా తల వంచుకుని వెళ్లిపోయాడు.

వీరలక్ష్మి ముఖంలో మాయమయిన నెత్తురు తిరిగొచ్చేసింది. మల్లి ఒంటిలోని నెత్తురు చల్లబడింది.

''ఇది మన కులం సమస్యే కాదు, మా కుటుంబ సమస్య. తప్పు వీరలక్ష్మి చేసినా, దాని కూతురు చేసినా కడుపులో పెట్టుకోవాలి,'' అని వీరలక్ష్మి దగ్గరకొచ్చి తల నిమిరాడు.

''అన్నయ్యా!'' అని భోరుమంది. కుమిలి కుమిలి ఏడ్చింది. వెంకటపతిరాజు కళ్ల నుంచి కూడా నీళ్లు రాలాయి. తెల్లటి మీసాల మీద పడ్డ ఒకటి రెండు కన్నీటి బొట్లు మంచి ముత్యాల్లా మెరిశాయి.

మల్లికి కళ్లు మిలమిలలాడాయి- ఆశతోనూ, ఆప్యాయతతోనూ.

''తల్లీ! నాకంతా తెలుసు. నీ స్థితిలో నేనున్నా అలాగే చేస్తాను. అవిటి కూతురు కదా- అని అడిగినవన్నీ ఇస్తున్నావు. కానీ ఏం పోగొట్టుకుంటున్నావో తెలుసా? పరువు పోయిందన్న బెంగతో పాపం మీ అత్తగారు మంచం పట్టి చచ్చిపోయింది. సత్య హరిశ్చంద్రుడు లాంటివాడు నీ భర్త తల యెత్తుకోలేక దేశాలు పట్టి పోయాడు. ఇక మేం ఊళ్లో తలెత్తుకోలేకపోతున్నాం. చర్చిపేటలోకి వెళితే, 'రాజుగారూ... రాజుగారూ' అని పిలిచేవాళ్లు, 'మావగారూ... బావగారూ...' అని వరసలు పెట్టి పిలుస్తున్నారు. వాళ్లేదో మనకంటూ తక్కువ- అని నా ఉద్దేశ్యం కాదు. మనల్ని తక్కువ చేసి మాట్లాడుతున్నారన్నది నా బాధ...!''

వెంకటపతిరాజు మాట్లాడుతున్నంతసేపూ ఏ ఒక్కరూ కిక్కురుమనలేదు. అనకూడదు కూడా. కోడిపందాల రాజుని ఒక్కటిచ్చుకున్నప్పుడే అర్థమయింది- అక్కడ ఒక్కడే మాట్లాడతాడు, మిగిలినవాళ్లు వినాలి.

''వీరలక్ష్మీ! పల్లంలో ఉన్న నా రెండెకరాల చెక్కా నీ కూతురి పేరు మీద రాసేస్తాను. కట్నం కింద ఇచ్చి మన కులపోడితో పెళ్లి చేసెయ్! మీ ఆయన్ని కూడా పిలిపిస్తాను. ఇంకో మాట మాటాడకు,'' అన్నాడు.

కులసభలో కలకలం.

త్యాగం... పరువు కోసం త్యాగం. తనకున్న నాలుగెకరాల భూమిలో రెండెకరాల త్యాగం.

వెంకటపతిరాజు దేవుడు.

ఈ మాట అక్కడున్న అందరూ ఒప్పుకున్నారు.

''అన్నయ్యా!'' అని వెళ్లి వెంకపతిరాజు కాళ్ల మీద పడింది వీరలక్ష్మి. ''నా సొంత అన్నయ్య కూడా ఇంత పనిచెయ్యడు అన్నయ్యా! కానీ, దాని ఇష్టాన్ని ఎలా కాదనగలను... నువ్వే చెప్పు,'' అని లేచి తల అడ్డంగా ఊపుతూ చేతులు జోడించింది.

నిశ్శబ్దం... నిర్ణయానికీ, తటపటాయింపుకీ మధ్య నిశ్శబ్దం. అవునుకీ కాదుకీ మధ్య నిశ్శబ్దం. విధేయతకీ ధిక్కారానికీ మధ్య నిశ్శబ్దం.

"వెంక మావయ్యా! నేను మన కులపోణ్ణే చేసుకుంటాను!" నిశ్శబ్దాన్ని నిలువునా చీల్చేసింది మల్లి.

ఆశ్చర్యం! ఆనందం! విజయం! ఈ మూడు వెంకటపతిరాజు ముఖంలో కనిపించాయి. అతని తెల్లమీసాలు మరింత తెల్లగా నవ్వాయి.

"అవున్రా మల్లీ! నువ్వు రాచబిడ్డవురా! రాజోణ్ణే చేస్కోవాలి," అంటూ భుజం తట్టాడు.

"చేసుకుంటాను. ఈ కులంలోనే, ఈ ఊళ్లోనే చేసుకుంటాను. పెద్ద కుటుంబాలోళ్లంతా ఇక్కడే వున్నారు. ఎవరి కొడుకు ముందుకొచ్చినా చేసుకుంటాను. ఆడు తాగుబోతయినా, ముండల ముఠాకోరయినా, ఎవడయినా, వేలిముద్రగాడయినా చేసుకుంటాను. ఎవడొస్తాడో ముందుకు రమ్మను. నాకోసమనే కాదు, నువ్విచ్చే రెండెకరాల కోసమొచ్చినా చేసుకుంటాను. రమ్మను."

అక్కడికక్కడే, అప్పటికప్పుడే స్వయంవరాన్ని ప్రకటించింది మల్లి అనబడే చిరంజీవి సౌభాగ్యవతి సైపరాజు మల్లీశ్వరీదేవి.

ఊళ్లో ఎవరి మోమును సినీతార ముఖాన్ని చూసినంత ఆబగా చూస్తారో, సాక్షాత్తూ ఆమె పెళ్లాడతానంటే ఎంతమంది రావాలి? ఏ ఒక్క క్షత్రియపుత్రుడూ దిగి రాలేదు.

కులసభకొచ్చిన వారంతా మెల్లగా జారుకున్నారు.

ఒకే ఒక్కడు, ఒక్కడే ఒక్కడు, దేవుడులాంటి మగవాడు వెంకటపతిరాజు మిగిలిపోయాడు.

నవ్వింది. మల్లి నవ్వింది. తలవంచుకోవాల్సిన పెళ్లికూతురు తలయెత్తి నవ్వింది.

అవమానం. వెంకటపతిరాజు పెద్దరికానికి అవమానం. తల బద్దలు కొట్టుకుని చావాల్సినంత అవమానం.

"వెంక మావయ్యా! మన పరువును నిలపగలిగినవాడు ఇంకా ఒకడున్నాడు. అతను ఒప్పుకుంటే నీ రెండెకరాల చెక్క కూడా నీకే ఉండిపోతుంది," అంది మల్లి.

"ఎవరమ్మా! మన కులపోడేనా?" తిరిగొచ్చిన ఆశతో అడిగాడు వెంకట పతిరాజు.

"మన రాచోడే. మన ఊరోడే. అదే నీ కొడుకు విక్రమవర్మ!" మల్లి మెత్తగా అంది.

వెంకటపతిరాజు ఉలిక్కిపడ్డాడు. చెంపమీద కొట్టినట్టు అనిపించింది. కోడిపందాల రాజే వెనక్కి వచ్చి ఛెళ్లు మనిపించిందాడా? లేక మల్లి కొట్టిందా?

కాళ్లులేని రాచబిడ్డ. ఆడబిడ్డ సవాలు విసిరింది. క్షణం క్రితం నిందితురాలు ఇప్పుడు తీర్పరిగా మారింది. తీర్పు చెప్పాల్సిన తాను నిందితుడుగా మారాడు. వెంకటపతిరాజుకు కాళ్లున్నాయి. కానీ ఆడటం లేదు.

ఈలోగా ఒక్క ఉదుటున పరుగెత్తుకుంటూ వచ్చింది వీరలక్ష్మి!

రెండు చేతుల్తో తన గారాబాల మల్లి రెండు బుగ్గలు ఎరుపెక్కేలా కొట్టింది. ఏడ్చుకుంటూ, తిట్టుకుంటూ తిట్టుకుంటూ ఏడ్చుకుంటూ కొట్టింది.

"ఆశకు అంతుండాలే ముదనష్టపుదానా! యెంక మావయ్య దేవుడే! రాక్షసిదానా ఆయన ప్రాణాల్నే బలి గోరతావా?" అని శాపనార్థాలు పెట్టింది.

తల్లడిల్లే హింస. హింస చేసినవారే గాయపడే హింస. పురుటినొప్పుల పరమ హింస.

*

పొత్తిళ్లలో శిశువులా పొద్దున్నే కిటికీలో సూర్యుడు.

మల్లి కళ్లు తెరిస్తే- ఎదురుగ్గా అమ్మ- బైబిల్ చదువుకుంటూ.

కూతురు నిద్రలేస్తున్న అలికిడి విని, చదివే బైబిల్ మధ్యలో ఆపి, లేచి, ప్రార్థన చేసుకొని కూతుర్ని పైకి లేపి, ఆమె రెండు చేతుల్ని తన రెండు చేతుల్లోకి తీసుకుని, వాటితో తన చెంపలు వాయించుకుంది.

మల్లి విదిలించుకుని తన చేతుల్ని వెనక్కి తీసుకుంటూ, "నీ బుగ్గలకు ఈమాత్రం ఎరుపు చాల్లే. నీ అందం ఎంత పెంచుకున్నా వేస్ట్. మీ ఆయన తిరిగి రాడు," అంది.

తల్లి వీరలక్ష్మి ఉడుక్కుంటూ మల్లిని మళ్లీ కొట్టబోయింది.

"ఏం మళ్లీ చెంపలు వాయించుకుంటావా?"

"అవునే వేసుకుంటాను. నా కూతురు, నా ఇష్టం. జీసస్‌కు కూడా చెప్పేశాను. ఆయన నన్ను క్షమించేస్తాడు," అంటూ కాలకృత్యాలు తీర్చుకోవడంలో మల్లికి తన వంతు సేవలందించి, మళ్లీ వెనక్కు తీసుకొచ్చి మంచం మీద కూర్చోబెట్టింది.

"అమ్మా! నీకో సీక్రెట్ చెప్పనా? నాకు రాత్రి జీసస్ కలలోకి వచ్చాడు," అంది మల్లి.

వంటింట్లోకి వెళ్లబోయిన వీరలక్ష్మి ఆగిపోయి, "జీసస్సా! ఆయనతో అయినా ఒబ్బిడిగా మాటాడావా?" అని ఆందోళనగా అంది.

"మన జీసస్సే కదా! నాకు ఎలా తోస్తే, అలా మాట్లాడాను."

"నేను నిన్ను కొట్టాను కదా! పిచ్చితండ్రి, నిన్ను ఊర్కోబెట్టడానికి వచ్చుంటారు."

"అందుకే మరి, నా మీద చెయ్యెత్తకు. ఆయనకు తెలిసిపోతుంది," అంటూ నవ్వేసింది మల్లి.

"అద్సరే... ఆయన్నేమడిగావ్?" ఉత్కంఠ తట్టుకోలేకపోతోంది వీరలక్ష్మి.

అది గ్రహించిన మల్లి, "అయితే వేడివేడి కాఫీ ఇచ్చుకో ముందు...!" అని షరతు విధించింది. క్షణంలో వీరలక్ష్మి కాఫీ కప్పు చేతికి ఇచ్చి, తాను మంచం మీద కూర్చొని కూతుర్ని ఒళ్లో కూర్చోబెట్టుకుంది.

"ఊఁ... చెప్పు, ఏమడిగావ్?"

"అడగడమేమిటి? కడిగేశాను. కళ్లులేని వాళ్లకి కళ్లిచ్చావ్. కాళ్లు లేని వాళ్లకు కాళ్లిచ్చావ్. నేను నీ సన్నిధిలోనే పెరిగాను. మరి నాకెందుకు కాళ్లివ్వవు, అన్నాను," అంది మల్లి.

"మరి ఆయనేన్నారు?"

"ఏమన్నారా? 'ఓసి వెర్రిదానా! నీకు అమ్మ ఒడిని శాశ్వతంగా ఇచ్చాను. అందుకే కాళ్లివ్వలేదు. అందరు తల్లులూ రెండేళ్లో మూడేళ్లో ఎత్తుకుంటారు. నిన్ను మాత్రం అమ్మ జీవితాంతం ఎత్తుకుంటుంది,' అన్నారు," అని కాఫీ గుటక వేసింది మల్లి.

గుటకలు...! కన్నీళ్లు మింగలేక అమ్మ కూడా గుటకలు వేసింది.

ఇద్దరూ తేరుకున్నారు.

"నా బంగారాన్ని... నేను ఉన్నంతకాలం ఎత్తుకుంటాను... నా తర్వాత," అనేసింది అమ్మ.

"నువ్వెత్తుకున్నంత కాలం నేను ఉంటాను. సరేనా?" అంటూ అమ్మ గుండెల్లోకి ఒదిగిపోయింది మల్లి.

"కూతురు మాటల్లో అర్థం ముందు ధ్వనించలేదు. తర్వాత బోధపడి కూతురు నోట మరో మాట రాకుండా నోరు నొక్కేసి, "నా బంగారుకొండకి జీసస్ పూర్ణాయుష్షు ఇస్తాడు," అని తనవైపు శూన్యంలో శిలువ గుర్తు వేసుకుంది. కాని వీరలక్ష్మి మనసు మనసులో లేదు.

'నా తర్వాత... నా తర్వాత...' అని మెల్లిగా తనలో అనుకొని, "ఇవాళ సాల్మన్‌రాజుని కలుస్తావా...?" అడిగింది ఆందోళనగా తల్లి.

"నేను మరిచిపోయాను. రాత్రే మరిచిపోయాను. నువ్వు కూడా మరిచిపో. దేవుడి కోసమే మనమా పేటకు వెళ్లాం. దేవుణ్ణి తెచ్చుకోవాలి కాని, పేటలను తెచ్చుకోకూడదు. కోడిపందాల రాజుగాడు అంత మాటన్నాక కూడా బుద్ధిరాలేదా?" మల్లి తల్లి మీద కన్నెర్ర చేసింది.

మరపు. తనకు కాళ్లు లేనట్లు మరపు. తనకు ప్రేమ ఉన్నట్లు మరపు- ఈ రెండూ చాలు బతికెయ్యటానికి.

మరపును తిరగేస్తే తలపు.

*

మల్లికి మనసు చివుక్కుమన్నప్పుడల్లా, తన అవిటితనమూ, తన ప్రేమ వ్యవహారమూ గుర్తుకొచ్చి చంపుకుతింటున్నాయి.

స్కూల్‌లో ఇంటర్వెల్ ఇచ్చినప్పుడల్లా ఇదే తలపు. అందరూ గెంతుకుంటూ బయటకు వెళ్లేవారు. ఐస్‌ఫ్రూట్లూ, పీచుమిఠాయిలూ కొనుక్కునేవారు. తన పైసల్తో ఎవరో ఒకరు తనకు కూడా కొని తెచ్చేవారు. కాకుంటే ఫిఫ్టీ పర్సెంట్ కమీషన్. రెండు పీచుమిఠాయిలు కొంటే ఒకటి తెచ్చినవాళ్లకూ, ఒకటి తనకూ.

అప్పుడు ఎలా వచ్చేవాడో తెలీదు కాని, సమయానికి ప్రత్యక్షమయ్యేవాడు బలవంతుడైన సాల్మన్ రాజు. అదీకాక అతడు మల్లికన్నా మూడు నాలుగేళ్లు పెద్దవాడు. పేటలో వాళ్లు అంతే, ఆలస్యంగానే పిల్లల్ని బళ్లో వేస్తారు.

మల్లిని అమాంతం ఎత్తుకొని, పరుగుపరుగున తీసుకెళ్లి, ఆడపిల్లల టాయిలెట్ దగ్గర వదిలి, మళ్లీ అయిదు నిమిషాలు కాగానే అంతే వేగంగా తిరిగి తెచ్చి క్లాసులో కూర్చోబెట్టేవాడు.

ఈ పని తోటి బడిపిల్లల నుంచి టీచర్ వరకూ ఎవరికీ నచ్చేదికాదు. పేట కుర్రాడు, అలా ఓ రాచ బిడ్డను ఎత్తుకోవటం ఎబ్బెట్టుగా అనిపించేది. కానీ ఎవ్వరూ అడ్డు చెప్పలేకపోయేవారు. ఎందుకంటే ఆ పనిని సాల్మన్‌రాజు తప్ప మరొకరెవ్వరూ చెయ్యలేరు.

అమ్మ తర్వాత, మల్లిని అంత చిన్న వయసు నుంచీ అంత గాఢంగా హత్తుకున్నవాడు సాల్మన్‌రాజు మాత్రమే. ఈ తంతు ఏడవ తరగతి చదివే వరకూ జరిగింది. తర్వాత, సాటి ఆడపిల్లల సాయంతోనే వెళ్లేది. మల్లి పది తర్వాత కాలేజీకి వెళ్లలేదు. కానీ దూరవిద్యలో బియ్యే పూర్తిచేసింది. ఏ పరీక్షకయినా రాతే తనది, మోత అమ్మదే.

సాల్మన్‌రాజు పట్నం వెళ్లి హాస్టల్‌లో ఉండి ఎమ్మే వరకూ చదివాడు. ప్రతి ఆదివారం పట్నం నుంచి వస్తుండేవాడు.

ఆ ఆదివారం కోసమే వారం అంతా ఎదురు చూసేది మల్లి.

'నా రాజు వస్తాడు. ఏదో వంకన నన్నెత్తుకుంటాడు,' ఈ ఒక్క కలే... ఆమెకి ఇష్టమైన కల.

తనకు కాళ్లొస్తాయని అమ్మ మతం పుచ్చుకుంది. కాళ్లు రాకపోయినా ఈ కల మాత్రం వచ్చింది. ఈ కల మాత్రం వచ్చింది. ఇది ఉత్త కలకాదు, ప్రతీ ఆదివారం నిజమయ్యే కల.

''అదిగో ఆ కొమ్మన పండిన జామపండు చూశావా,'' అని చర్చి కాంపౌండులోని జామచెట్టును చూపిస్తాడతడు.

''కోసివ్వు,'' అంటుంది ఆమె.

''నీతో కోయిస్తా,'' అంటాడు అతడు.

నెపం! నిజాన్ని చిన్నబుచ్చే నెపం! ఆమెను ఎత్తుకోవటానికి ఓ నెపం!

అమ్మ ఎత్తుకోవడానికీ, సాల్మన్‌రాజు హత్తుకోవడానికీ తేడా వుంది.

అమ్మ ఎత్తుకున్నప్పుడు ఒదిగిపోతుంది. భద్రత అందుతుంది.

సాల్మన్‌రాజు ఎత్తుకున్నప్పుడు ఎదిగిపోతుంది. స్వేచ్ఛ పొందుతుంది.

అమ్మ బతికిస్తుంది. అతడు గెలిపిస్తాడు.

అతడు ఎత్తుకున్నప్పుడల్లా, ఆమె కళ్లలోకి చూస్తాడు. ఎప్పుడూ ఒకటే ప్రశంస. అంతకుమించి పొగడ్తలు కూడా అతడికి రావు. 'నీ కళ్లు నవ్వుతాయి,' అతడికి అనడం, ఈమె వినటం- ఇద్దరికీ వ్యసనాలయిపోయాయి.

తను కోరుకోవాలి కాని, సాల్మన్‌రాజు తనను ఎవరెస్టు శిఖరానికి ఎత్తుకొని తీసుకుపోగలడు.

ఈమధ్య రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు పరీక్ష కూడా రాశాడు. టీటీఈ ఉద్యోగమొస్తుందనీ, దేశమంతా రైల్లో తిప్పి చూపిస్తానని మల్లికి చెప్పాడు.

ఇలా చెప్పాక, రెండు ఆదివారాలు అతడు పట్నం నుంచి రాలేదు. అతడికి ఫోను కలవలేదు.

అప్పుడే తప్పు చేసింది. అడిగేసింది అమ్మను- సిగ్గు విడిచేసి. 'నన్ను సాల్మన్ రాజు దగ్గరకి తీసుకువెళ్లు,' అని. అనుకున్నట్టే జరిగింది. టైఫాయిడ్ జ్వరంతో ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. కూలి చేసుకునే తల్లిదండ్రులకి కబురు పంపడం- ఎందుకులే అని ఒక్కడే జ్వరంతో పోరాడుతున్నాడు.

అమ్మా, తనూ ఆసుపత్రిలోనే ఉండిపోయారు. తనకో 'వీల్‌ఛైర్' ఏర్పాటు చేయించాడు.

అతడికి బెడ్ దగ్గరగా లాక్కొని, అతని తలని బలంగా పైకి ఎత్తి బత్తాయిరసం తాగించాలనుకునేది మల్లి. కానీ అతడు తన స్వశక్తిని ఉపయోగించే తలను లేపేవాడు. అప్పుడు కూడా అతడు మల్లినే గెలిపించాడు.

'నీ కళ్లు నవ్వుతాయి,' మళ్లీ అనేశాడు. ఆ నవ్వే ఔషధమయ్యిందేమో, మూడోరోజుకే డిశ్చార్జ్ అయ్యాడు.

ఆరోజు నుంచి తాను సాల్మన్‌రాజును ఎప్పుడు, ఎక్కడ చూడాలన్నా ఎత్తుకుని తీసుకువెళ్లేది అమ్మ.

'ఇక సాల్మన్‌రాజుతో రేపో మాపో పెళ్లి,' ఊరంతా పాకిపోయేటంతగా మల్లి, సాల్మన్‌రాజులు కలిశారు. అన్నిసార్లు కలిపింది.

మల్లి వాళ్ల నాన్న మల్లిని బండబూతులు తిట్టాడు. వీరలక్ష్మిని కొట్టాడు. ఇద్దరూ లొంగలేదు. చివరకి పరువు పోయిందని ఊరు వదిలి పారిపోయాడు.

వెంకటపతిరాజు కూడా వీరలక్ష్మిని చాలాసార్లు చూచాయిగా మందలించి, ఇక లాభం లేదని కుల పంచాయితీ పెట్టాడు.

వెంకటపతిరాజు మనసులో మాటనే కోడి పందాల రాజు అన్నాడు.

తనవల్ల తన తల్లి పడరాని మాట పడింది. 'నువ్వు కూడా ఏ జాన్‌రాజుగారినో చూస్కో' అని కోడిపందాల రాజు తన తల్లిని అనేశాడు. అంటే... తన తల్లిని ఓ తిరుగుబోతు కింద జమ కట్టాడు.

అమ్మకు ఏం మిగిలింది? తననూ మోసింది. తన కన్నా బరువయిన నిందనూ మోసింది. ప్రతి ఆనందానికి దూరమయింది. కడకు భర్త కూడా మిగల్లేదు. అంతా తన వల్లేనా?

ఒక్క సాల్మన్‌రాజును మరచిపోతే, అమ్మ మీద నింద పోతుంది. నాన్న తిరగొస్తాడు.

ఒక చిన్న మరపు.

కళ్లు మూసుకుంది. 'తండ్రీ! ప్రతీ పరీక్షకి ముందూ, జ్ఞాపకాన్ని ఇమ్మని కోరుకున్నా! ఇదీ పరీక్షే! నీకు చేతనయితే పిడికెడు మరపును ప్రసాదించు,' అని దేవుణ్ణి కోరుకుంది.

మరపు వచ్చినట్టుగానే ఫీలయింది. అమ్మతో ముచ్చట్లాడింది. ఆరోజు రోజంతా అమ్మని వదల్లేదు. అరచేతుల్లో గోరింటాకు పెట్టించుకుంది. రెండు జడలు వేయించుకొంది. నాన్న కొన్న నక్లెస్ పెట్టించుకుంది.

పిచ్చిది అమ్మ ప్రతీ చిన్న ఆనందానికి ఏడ్చేసింది.

అలా ఎందుకు ఏడ్చిందో ఆరోజు పగలూ, రాత్రీ గడిచి మళ్లీ తెల్లవారాకగాని మల్లికి అర్థంకాలేదు.

*

పొద్దున్నే కిటికీలో ఎండమీద పడుతున్నా, అమ్మ మల్లిని హత్తుకునే పడుకుంది.

కానీ గుండెల్లో వెచ్చదనం లేదు.

అమ్మ చేతిని వదిలించుకోబోయింది. కానీ వదల్లేదు. ఎందుకంటే, అమ్మ ఆమెను శాశ్వతంగా వదలిపోయింది.

అరచింది. ఊరూవాడా ఏకమయ్యేలా అరిచింది. తనని తాను శపించుకుంది. తాను తప్పు చేశానని ఒప్పుకుంది.

అమ్మ చల్లని చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని తన చెంపలు వాయించుకుంది.

"ఎక్కడికెళ్లినా చెప్పే వెళ్తావ్ కదమ్మా! జీసస్ దగ్గరకి వెళ్తూ ఎందుకు చెప్పలేదే నాకూ...! కూడా వచ్చేస్తానని కున్నావా? ఎందుకొస్తానే! రాను. నేను వస్తే అక్కడ కూడా నీకు నా మోత తప్పదు కదా! నేను రానే అమ్మా!" అంటోంది ఆమె.

మల్లి గుండె పగిలిన అగ్నిపర్వతంలా కాలుతూ కరుగుతోంది.

ఆమెను ఓదార్చే శక్తి అక్కడ ఎవ్వరికీ లేదు, ఒక్క సాల్మన్‌రాజుకి తప్ప.

అందుకే పాస్టర్ కూడా సాల్మన్‌రాజునే ముందుకునెట్టాడు.

సాల్మన్‌రాజు చేతులు చాచాడు.

"నేను రాను. ఎత్తుకునేవాళ్లను నేను నమ్మను. మధ్యలో దించేస్తారు. ఇదిగో అమ్మ దించేసి పోయింది. నువ్వూ అంతే. ఎత్తుకున్నట్టే ఎత్తుకుని మధ్యలో దించేస్తావ్. పో... దగ్గరకి రాకు...!" అని వెర్రిచూపులు చూసింది మల్లి.

ముందుకు రాబోయిన సాల్మన్‌రాజు కాస్త వెనక్కి తగ్గి, పాస్టర్ వైపు చూశాడు. ఆయన కాస్త ధైర్యం చేసి ముందుకు వచ్చి,

"ఎవరు దించినా దేవుడు దించడు. ఎత్తుకునే ఉంటాడు," అని అంటూ తన తల్లి తల దిండు దగ్గర ఉన్న బైబిల్ తీశారు.

"దేవుడా? ఆయన నన్ను పుట్టీ పుట్టగానే దించేశాడు. వీళ్లే నయంగా, సగం వరకన్నా మోశారు," అంది నిష్ఠూరంగా.

బైబిలు తెరచిన పాస్టర్ ఆశ్చర్యపోయారు. అందులో వీరలక్ష్మి చనిపోయే ముందు రాసిపెట్టిన చీటీ ఉంది. జాగ్రత్తగా మల్లికిచ్చారాయన.

"నా బంగారం,

నిన్ను కడదాకా మోయగలిగింది సాల్మన్‌రాజే. నేను బతికుండగా పేటలోకి నిన్ను కాపరానికి పంపలేను. అందుకే యేసయ్య దగ్గరకి వెళ్లిపోతున్నాను. ముద్దులతో... అమ్మ."

ఈ ఉత్తరం చదివేక, మల్లి సాల్మన్‌రాజు వైపు చూసింది. మెల్లిగా చేతులు చాచింది. అతడు ఎత్తుకున్నాడు. అందరూ కన్నీళ్లను అక్షింతల్లా చల్లారు.

తల్లీ, కూతుళ్లు ఎవరి ప్రయాణానికి వారు సిద్ధమయ్యారు.

తల్లి కాటికి, కూతురు పేటకి.

పేటపేటంతా రోదిస్తుంటే, ఊరు ఊరంతా నిశ్శబ్దంగా ఉంది.

వీరలక్ష్మిని పెట్టెలో పెట్టారు.

సాల్మన్‌రాజును మల్లి ఒక కోరిక కోరింది. తన తల్లిని తాను మొయ్యాలని.

పెట్టెను పేటలో వాళ్లే పైకెత్తారు. సాల్మన్ మల్లిని ఎత్తుకొని, పైకి లేచిన పెట్టె దగ్గరకు తెచ్చాడు. తల్లికి మల్లి తన కుడిభుజాన్నిచ్చింది. తనను మోసిన అమ్మను తాను మోస్తోంది. అవును, తను నడుస్తోంది. తనకి కాళ్లొచ్చాయి. సాల్మన్‌రాజు కాళ్లు తన కాళ్లయ్యాయి.

యాత్ర ఊరు దాటి పేటకొచ్చింది.

ఒక తప్పు ఒప్పయ్యింది.

*నవ్య వీక్లీ, 4 మే 2011*